**కథ**

# కార్యేషు దాసి

గోపాలం ఇంట్లోకి రావటం చూసి, వంటింట్లో నించి పిలిచింది భామ ''ఏమండీ! ఓసారి ఇలా రండి'' అని.

గోపాలం ఆ మాటలు విన్నట్టు లేదు. తను తెచ్చిన ఒక పెద్ద పాకెట్టు డ్రాయింగ్ రూంలో పెడుతున్నాడు.

''ఏయ్ గోపాలం నిన్నే. ఓసారిలా వంటింట్లోకి రమ్మంటుంటే వినిపించుకోవేం?'' ఈసారి అరిచింది భామ.

గోపాలానికి తెలుసు, భామ మొదటిసారి పిలుస్తుంది, రెండోసారి అరుస్తుంది, మూడోసారి కరుస్తుంది అని. అందుకే ''వస్తున్నా... వస్తున్నా'' అంటూ వెంటనే వచ్చేశాడు.

భామ మిరపకాయ బజ్జీలు వేస్తున్నది. కుడి చేతి నిండా శనగపిండి, ఎడమ చేతిలో వామూ ఉప్పూ కూరిన పచ్చి మిరపకాయలు. చీర కొంచెం పైకి లాగి, నడుము దగ్గర దోపుకుంది. తల ముంగురులు చెదిరి ఆమె అందమైన తెల్లటి నుదుటి మీద లీలగా నాట్యం చేస్తున్నాయి.

గబగబా అక్కడికి వచ్చి, గోపాలం ఆమెను చూసి ''అమ్మో ఎంత అందంగా వున్నావో'' అంటాడనుకున్న భామ ''హాయ్ హాయ్ మిరపకాయ బజ్జీలు చేస్తున్నావే... వండ్రఫుల్!'' అని తన వేపు కూడా అతను చూడకపోయేసరికి కొంచెం నిరుత్సాహపడింది.

ఆమె ఎడమ కంట్లో నీరు చూసి ''ఇప్పుడు నేనేమన్నానని... ఇంతలోనే ఆ కళ్ళల్లో నీళ్ళు'' అంటున్న గోపాలాన్ని నృత్య భంగిమలో చేత్తో వారించి, ''నా ఎడమ కంట్లో నలుసు పడింది. కాస్త ఊదు..'' అన్నది.

గోపాలం ఆమెను తేరిపార చూసి ''ఏం! నువ్వు ఊదుకోలేవూ. ఆమాత్రం దానికే నన్నంత దూరం నించీ పిలవాలా'' అన్నాడు.

''నా కంట్లో నేనెలా ఊదుకుంటాను గోపాళం. అందులోనూ చెట్టంత మొగుడివి నువ్వు ఎదురుగా వుండగా, బొత్తిగా బుర్రా బుద్ధీ లేకుండా మాట్లాడతావ్ అప్పుడప్పుడూ'' కోపం నటించింది భామ.

''ఓకే... ఓకే'' అని గోపాలం భామ గడ్డం పట్టుకుని సుతారంగా ఆమె ముఖం పైకెత్తి, ఎడమ కంట్లో నెమ్మదిగా ఊదాడు.

ఊది, ''పోయిందా?'' అని కూడా అడిగాడు.

భామ గులాబీ రేకుల్లాటి కను రెప్పల్ని, పైకి కిందకీ టపటపా ఆర్పి ''ఆ! పోయింది'' అన్నది తీయగా గోపాలం వేపు చూస్తూ.

ఆ పెద్ద పెద్ద కళ్ళల్లోకి చూసి ''అమ్మో! ఎంత అందంగా వున్నావో!'' అన్నాడు గోపాలం తన కళ్ళు పెద్దవి చేసి.

ఇందాకే అనవలసిన డైలాగు, ఆలస్యంగానయినా కనీసం అన్నాడు కనుక, భామ ఒక చిరునవ్వు నవ్వి ''ఏమిటి, ఏదో పాకెట్ తెచ్చారు?'' అన్నది.

''చెబుతా... చెబుతా... అంతకన్నా ముఖ్యమైనదొకటుంది'' అని ముందుకు వంగి, ఆమె లేతపెదవుల మీద ముద్దు పెట్టుకున్నాడు. పెట్టుకుని 'ఈ అందమంతా నాదే' అన్నంత పోజు పెట్టాడు.

''ఛీ... పట్టపగలు పట్టపగ్గాల్లేకుండా, వంటింట్లో ఏమిటా పనులు..మీరు మరీనూ..'' అన్నది భామ.

''నువ్వు బాపు బొమ్మలా ఇప్పుడు, ఇక్కడ కనిపిస్తుంటే, ఇంకెప్పుడో ఎక్కడో అంటావేమిటి? నిజంగా ముద్దొస్తున్నావు తెలుసా?'' అన్నాడు గోపాలం.

''ఛీ పాడు పిల్లాడా. నోరు మూసుకుని ఈ బజ్జీలు తిను'' అని రెండు బజ్జీలు ప్లేటులో పెట్టి గోపాలానికి అందించింది భామ.

''నిన్ను బాపుబొమ్మలా వున్నావని మెచ్చుకున్నాను కదా. అయినా కూడా రెండేనా..'' అన్నాడు గోపాలం.

ఒక నవ్వు విసిరేసి, తల ఎగరేసి అన్నది భామ. ''అవును రెండే! శ్యామూ లలితా వాళ్ళు ఇంకో గంటలో వస్తామన్నారు. అప్పుడు అందరితో కలిసి విందువుగాని. ఈలోగా ఇది. జస్ట్ ఎ శాంపుల్..''

గోపాలం చటుక్కున ఒక బజ్జీ కొరికి, నోరు కాలుతుంటే నాలిక బయటపెట్టి ''బజ్జీలు వేడిగా వున్నాయి'' అని చేత్తో విసినికర్రతో విసిరినట్టుగా ఆ మంటలనార్పుకుంటున్నాడు.

బజ్జీలు చేయటం పూర్తిచేసిన భామ చేతులు కడుక్కుంటూ పగలబడి నవ్వి ''అందుకే నోరు మూసుకు తినమన్నాను'' అంది.

గోపాలం అక్కడే వున్న ఆవకాయసీసా మూత తీసి పక్కనపెట్టి ''వేడిగా ఉన్నాయి కొంచెం ఆగండి అని చెప్పొచ్చుకదా'' అన్నాడు.

భామ అతన్ని సూటిగా చూసి, ఆవకాయ సీసా మూతపెట్టేసి ''వేడిగా వున్నాయి. కొంచెం ఆగండి'' అంది మళ్ళీ నవ్వి.

''ఇప్పుడా చెప్పటం..'' అన్నాడు ఉక్రోషంగా.

''అవును ఇప్పుడే. ఇప్పుడే వాయ తీసిన బజ్జీలు వేడిగా వుంటాయని ఆమాత్రం తెలీదూ'' అన్నది మళ్ళీ నవ్వుతూ.

''తెలుసమ్మా... కాకపోతే నీ అందం చూసి అవన్నీ మరిచిపోయాను. అంతే!'' అన్నాడు గోపాలం, ఆవకాయ సీసా చేతిలోకి తీసుకుని, మూత తీసి పక్కన పెడుతూ.

''ఇంతకీ ఏమిటి... ఏదో పెద్ద అట్టపెట్టె తెచ్చి దాచి పెట్టారు. నాకు గిఫ్టా? ఏముంది దాంట్లో..'' అంటూ ఆవకాయ సీసాకి మళ్ళీ మూత పెట్టింది భామ.

సీరియస్‌గా చూశాడు గోపాలం. ''ఏమిటి అసలు నీ ఉద్దేశ్యం. నన్ను మాటలతో మభ్యపెడుతూ, ఆవకాయ సీసాకి మూతపెట్టి దాచిపెడుతున్నావ్?'' గట్టిగా అడిగాడు.


మళ్ళీ నవ్వింది భామ ''డాక్టరుగారు ఏం చెప్పారు, ఊరగాయ పచ్చళ్ళు తగ్గించమని చెప్పలేదూ. వాటిల్లో వుండే నూనె, ఉప్పు ఆరోగ్యానికి మంచిది కాదుట. అందుకే బజ్జీలు ఈ టమోటా కెచప్‌లో నంజుకు తినండి. చాలా బాగుంటాయి. కారం కూడా తగ్గుతుంది'' అని టమోటా కెచప్ ముందుకు తోసింది.

''అదేం కాదు, ఉష్ణం ఉష్ణేన శీతలం అన్నారు శాస్త్రకారులు. మిరపకాయబజ్జీలు ఆవకాయలో నంజుకు తింటే అసలు కారం వుండదని దాని తాత్పర్యం. అందుకని నాకు ఆవకాయే కావాలి'' అన్నాడు గోపాలం మొండికేసి.

భామ ఆవకాయ సీసా తీసి అలమరలో పెట్టేసి, ప్లేట్‌లో టమోటా కెచప్ వేసి, ఆ ప్లేట్ తీసుకుని ''రండి ముందు గదిలోకి వెళ్ళి కూర్చుందాం'' అంది.

గోపాలం ఇక ఏమీ మాట్లాడకుండా ఆమె వెనకే నడిచాడు.

గోపాలం కూర్చోగానే, ప్లేట్ అతని ముందు పెట్టి నెమ్మదిగా అన్నది భామ ''ఇంటి పనుల



ఎక్కువ
యిపోయాయండీ. చేయలేక ఛస్తున్నాను''
అని.

''అదేం? పనమ్మాయి వస్తున్నది కదా..'' అడిగాడు గోపాలం బజ్జీలు కెచప్‌లో నంజుకు తింటూ.

''వస్తున్నది... కానీ నేను అందరిలా అన్ని పనులూ చేయించుకోవటం లేదు. అంట్లు తోమటం, పొద్దున్నే ఇల్లు ఊడవటం తప్ప వేరే పనులేవీ చేయించుకోవటం లేదు. అవన్నీ నేనే చేసుకుంటున్నాను'' అంది.

''ఓకే. అది నీ ఛాయిస్. దానికి నేనేం చేయను'' అన్నాడు గోపాలం.

''నాకు ఇంటి పనుల్లో కాస్త సహాయం చేయకూడదా అని''

''ఎందుకు చేయటం లేదూ. ఎప్పుడూ చేస్తూనే వుంటాను కదా. నువ్వే నన్నే పనీ చేయనీయవు. ఫరెగ్జాంపుల్. ఈ బజ్జీల్లో ఆవకాయ నేనే వేసుకుందామనుకున్నాను. నువ్వేమో వద్దని అడ్డం పడ్డావ్. కిచెన్‌లో నించి నా ప్లేట్ నేనే తెచ్చుకుందామనుకుంటుంటే కెచప్ వేసి నువ్వే తీసుకొచ్చావ్..''

భామ పకపకా నవ్వింది. ''ఇంకా నయం మీ తిండి మీరే తినటం కూడా ఒక పనిలా చెబుతారనుకున్నాను. నేను చెప్పేది మీ తిండి గురించి కాదు''

సత్యం మందపాటి

అని పకపకా నవ్వటం ఆపేసి, సీరియస్‌గా ముఖం పెట్టి, ''నేను చెప్పేది మన ఇంటి పనుల గురించి. నాకు మీరు ఇంట్లో సహాయం చేస్తారా లేదా? సూటిగా జవాబు చెప్పండి'' అంది.

గోపాలం గంభీరంగా నవ్వి తన చొక్కా కాలర్ పైకెత్తి అన్నాడు. ''చూశావా మరి. నాకు ముందు చూపు ఎక్కువ అని కనపడ్డ ప్రతి వెధవా ఎందుకంటాడో ఇప్పుడయినా అర్థమయిందా? ఇందుకే. నువ్విలా అడుగుతావని నాకు ముందే తెలుసు. నాకూ ఇంటి పనుల్లో నీకు సహాయం చేయాలనే వుంటుంది. కార్యేషు దాసుని కదా మరి. అందుకే...'' చెప్పటం ఆపాడు గోపాలం.

''అందుకే అంటే ఎందుకేమిటి కాళిదాసూ?'' సన్నటి కనుబొమల్ని ఇంద్రధనుస్సులా ముడిచి అడిగింది భామ.

''వస్తున్నా... వస్తున్నా. అందుకే నీకు సహాయంగా వుంటుందని ఇది కొన్నాను. అది సరే కానీ నేనన్నది కాళిదాసు కాదు. కార్యేషు దాసు'' అని లేచి, సోఫా వెనకనించీ ఆ పెద్ద అట్టపెట్టెని ముందుకు లాక్కువచ్చాడు.

మూసిన గుప్పిట చూపుడు వేలుని తన సున్నటి బుగ్గ మీద వేసుకుని, తన పెద్ద కళ్ళను ఇంకాస్త పెద్దవి చేసి అడిగింది భామ ''ఏమిటది దేవదాసూ! ఏముంది దాంట్లో?''

''చెబుతా... చెబుతా... అయినా మధ్యలో ఈ దేవదాసెవడు? నేను దేవదాసునీ కాదు, రామదాసునీ కాదు. భామ దాసుని'' అంటూ ఆ పెట్టి విప్పి, దాంట్లో నించి ఒక వాక్యూమ్ క్లీనర్ బయటికి తీశాడు గోపాలం.

''ఏమిటది'' అడిగింది భామ.

''వాక్యూమ్ క్లీనర్. ఇది దుమ్మూ ధూళినే కాకుండా, రాళ్ళనీ రప్పల్నీ, కొండల్నీ కోనల్నీ కూడా ఝుమ్మని లాగేస్తుంది. మోస్ట్ పవర్‌ఫుల్ వాక్యూమ్ క్లీనర్ ఇన్ ది హోల్ వరల్డ్. కొత్తగా వచ్చింది. కొత్తగా వుండగానే కొనేస్తే కొత్తగా వుంటుందని వెంటనే బోణీ చేసేశాను''

''అంతే కానీ నాకు సహాయంగా వుంటుందని

కాదన్నమాట'' అన్నది భామ కొంటెగా ముక్కు చిట్లించి.

''అదేమిటి నేను నీకోసం ప్రేమతో కొంటే, నువ్విలా కొంటె మాటలు మాట్లాడతావ్. నీకు ఇంటి పనుల్లో సహాయం చేయటమే భర్తగా నా బాధ్యత. కర్తవ్యం. డోంట్ వర్రీ మై డియర్. ఐ యామ్ హియర్!'' అన్నాడు గోపాలం అట్టపెట్టెలోనించి ఒక్కొక్కటే బయటకు తీస్తూ.

''ఎంతయిందేమిటి?'' అడిగింది భామ, తన మెడలో గొలుసు ఎంత సన్నగా వుందో చేత్తో తడుముకుంటూ.

''ఎంతయితే నీకెందుకు తడిసి మోపెడయింది. డోన్ట్ బ్రింగ్ ది టాక్ ఆఫ్ మనీ వెన్ వుయార్ టాకింగ్ ఎబౌట్ అవర్ అన్యోన్య దాంపత్యం'' అన్నాడు గోపాలం.


భామ మూతి బిగించుక కూర్చుంది.

''అదిగో. మూతి అలా సున్నాలా పెట్టకు. నాకు ప్రేమ ఎక్కువయి పోతుంది. నువ్వెళ్ళి కాఫీ పెట్టు. ఒక్క అరకప్పు మాత్రమే సుమా. శ్యామూ వాళ్ళు వచ్చేలోగా శాంపుల్ అన్నమాట'' అన్నాడు గోపాలం.

భామ రెండు అరకప్పుల కాఫీ తీసుకు వచ్చి, గోపాలం చేస్తున్న పని చూసి నిర్ఘాంతపోయింది.

ప్లాస్టిక్ బక్కెట్‌తో బయటినించి మట్టి తెచ్చి, డ్రాయింగ్‌రూమ్ నేలమీద చల్లాడు. టీవీ క్రిందా, సోఫా క్రిందా, గదంతా చల్లాడు. నల్లగా వున్న ఆ మట్టితో డ్రాయింగ్ రూమంతా ఘోరంగా వుంది.

''ఇదేమిటి? ఈ చెత్తంతా పోశారు. ఇవాళ పొద్దున్నే ఇల్లంతా శుభ్రంగా కడిగించాను కూడాను'' అన్నది మరోసారి నిర్ఘాంతపోతూ.




గోపాలం నవ్వాడు. ''అలా అన్నిసార్లు నిర్ఘాంతపోకు. ఆరోగ్యానికి మంచిది కాదు. నువ్వు అలా కాళ్ళు పైకి పెట్టుకుని అసుంటా ఆ సోఫాలో కూర్చో. నేను మన సరికొత్త వాక్యూమ్ క్లీనర్‌తో, మొత్తం పది నిమిషాల్లో శుభ్రాతి శుభ్రంగా వాక్యూమ్ చేసేస్తాను. నువ్వు అద్దంలా మెరిసిపోయే ఈ నేల మీద నీ ముఖం చూసుకుని, అందమైన నీ నుదుటి మీద బొట్టు పెట్టు కుందువుగాని'' అని భామని సోఫాలో కూర్చోబెట్టాడు.



''ఏవండీ'' అని ఏదో అనబోతున్న భామతో ''చెప్పాను కదా. పదే పది నిమిషాలు నాకు వదిలేయ్. ఈరోజునించీ నీకు, నేను ఇంటి పనేచ నాతి చరామి అని వాగ్దానం చేస్తున్నాను. దటీజ్ మై ప్రామిస్'' అన్నాడు.

ఆ దుమ్ముకి పమిటె చెంగు నోటికి అడ్డం పెట్టుకుని, ఇంకా ఏదో అనబోయింది భామ.

''మొగుడి చేత పనిచేయించుకుంటున్నానే అని బాధపడుతున్నావు కదూ..నో..నో..డోంట్ డూ దట్. మనది అన్యోన్య దాపంత్యం. అపూర్వ సంసారం, ఆదర్శ కుటుంబం అని చెప్పుకున్నాం కదా. మనిద్దరం ఇంటి పనుల్లో వేణ్ణీళ్ళకి చన్నీళ్ళం అన్నమాట..'' అని వాక్యూమ్ క్లీనర్ని సర్ది, దాన్ని గోడ దగ్గర ప్లగ్‌లో పెట్టి, స్విచ్ ఆన్ చేశాడు గోపాలం.

అది ఆన్ అవలేదు.

''వాటీజ్ రాంగ్'' అంటూ వైర్లు చెక్ చేస్తున్నాడు గోపాలం.

భామ నెమ్మదిగా అంది. ''ఇందాకటి నించీ మీకు చెప్పబోతున్నది అదే. మీరు నా మాట అస్సలు వినిపించుకోటం లేదు. కరెంటు పోయింది. శ్రీ ప్రభుత్వం వారి పుణ్యమా అని, ఇవాళ్టినించీ రోజుకి నాలుగు గంటలు కరెంటు తీసేస్తారుట''

నిర్ఘాంతపోయి నోరు తెరిచాడు గోపాలం.

''అలా అనవసరంగా నిర్ఘాంతపోకు గోపాలం. నువ్వు ఇంట్లో నాకు చేస్తున్న సహాయం వేణ్ణీళ్ళకి చన్నీళ్ళు కాదు. నాకు మరిన్ని కన్నీళ్ళు. ఇప్పుడు ఈ మట్టంతా తీసి శుభ్రంగా వూడ్చి ఫినాయిల్‌తో ఇల్లు కడిగితే కానీ, కాళ్ళు కింద పెట్టటానికి వీల్లేదు. ఎంత పని చేశావు గోపాలం'' అంది దిగులుగా భామ.

ఇంకోసారి నిర్ఘాంతపోదామా వద్దా అనుకుంటున్న గోపాలం, బయట స్కూటర్ ఆపి లోపలికి వస్తున్న శ్యామ్, లలితలను చూసి నిఝంగా నిర్ఘాంతపోయాడు.

## తెలివైన రిచా

**రిచా అందమైంది కాదని ఎవరూ అనరు. అనలేరు కూడా. ఎందుకంటే ఆమె తీరైన అందంగల తరుణి కాబట్టి. 'ఆమె నవ్వు ఎదలోతులు తవ్వు' అని ఓ సినీకవి ఇటీవల మెచ్చుకున్నాడు రిచా నవ్వుని.**

**ఇలాంటి రిచాకి అవకాశాలు ఎన్ని వచ్చిపడుతున్నా, కథ, బ్యానర్, నిర్మాత, హీరో... ఇవన్నీ చూశాకే కాల్‌షీట్లు ఇస్తోంది. స్లో అండ్ స్టడీ విన్స్ ద రేస్ అనే సూక్తిని పాటిస్తోందేమో.** -శ్వేత